ఆ ప్లేటు తీస్తున్నప్పుడు వాడి కళ్ళలోని భావం శ్రీశ్రీ కనక చూస్తే గుండె నీరయ్యే పద్యం రాసేవాడు.

రా.వి. శాస్త్రిగారు చూస్తే కడుపు చెరువైపోయే కథ రాసే వారు.

నేను శ్రీశ్రీని కాను.

రా.వి. శాస్త్రిని కాను.

అంచేత వాడి భావం చదవగలిగానే కానీ రాసే భాష నా దగ్గర లేదు.

వచ్చినవాళ్ళు కావాలనుకుంటే ఆ మిగిలినవి పాక్ చేయించి కుక్కలకి తీసుకెళ్తారు. కానీ సర్వర్లు, క్లీనర్లు మాత్రం తినురు.

అది ఆ హోటల్‌కి అవమానం.

సూప్ వచ్చింది రెండు బౌల్స్‌లో.

అందులో చిన్న బ్రెడ్ ముక్కలు చచ్చిపోయిన చేపపిల్లల్లా తేల్తున్నాయి.

పక్కప్లేట్లో నాలుగు అప్పడాలు ఎగిరి పక్కవాడి ప్లేట్లో పడ్డాయి.

అతనికి సారీ చెప్పి వాటిని తీశాడు భాస్కర్.

ఏవిట్రా వెధవ నువ్వు? అన్నాడు కోపంగా.

లేకపోతే ఏవిట్రా? ఆకలికి సూప్ తాగి, తర్వాత అన్నం తింటావా? అంతకంటే ఆకలేసినప్పుడే అన్నం తింటేపోదా? దాన్ని మనం కొనుక్కోవాలా? అన్నాను నవ్వు ఆపి.

ఇంతలో భోజనం వచ్చింది.

దాని ఖరీదు తల్చుకుంటే నాకు తినాలనిపించలేదు.

ఈ హోటళ్ళలో పారేసే తిండితో ఒక చిన్నగ్రామం బతకొచ్చు. ఇవన్నీ నేషనల్ వేస్ట్,.

ఎలాగో తిన్నాననిపించాను. ఇంకా చాలా మిగిలిపోయాయి. అవి కుక్కకి పాక్ చెయ్యమన్నాను.

కార్లో వాడేదో పెళ్ళి కబుర్లు చెప్తూనే ఉన్నాడు. నేను వింటున్నానే కానీ, కళ్ళు రోడ్డు వెతుకుతున్నాయి. ఆ పిల్ల కనిపిస్తే బావుణ్ను. ఇంత రాత్రివేళ ఇంకా రోడ్డుమీద ఎందుకుంటుంది?

ఉంది!

కారాపు! అరిచాను.

తుళ్ళిపడి ఆపాడు భాస్కర్!

ఆ అమ్మాయి ఆ చిన్నపిల్లని పేవ్‌మెంట్‌మీద పడుకోబెట్టి పక్కన కూర్చుంది.

నేను కారు దిగి ఆ అమ్మాయి దగ్గరికి వెళ్ళాను.

ఇంటికెళ్ళలేదా? అడిగాను.

ఇల్లు లేదు అంది నెమ్మదిగా.

అమ్మ, నాన్న...

సచ్చిపోనారు అంది బిక్క మొహంతో...

ఒక్క నిమిషం నిశ్శబ్దం.

నెమ్మదిగా ఆ పాకెట్ ఆ అమ్మాయికిచ్చాను.

అ అమ్మాయి మొహంలో వెలుగు జన్మలో మరిచిపోలేను.

అది చాలు ఈ జన్మకి!.

**(ఆంధ్రప్రభ, వారపత్రిక 30.3.1998)**

# దాత

**చీ**మలు దూరని చిట్టడివి.

కాకులు దూరని కారడవి.

హెడ్డు వెంకటస్వామి మాత్రం ఆ అడవిలో దూరేశేడు.

అతను ఫారెస్టు డిపార్టుమెంటు కాదు.

యాంటీ నక్సలైట్ స్క్వాడ్ వచ్చేడు.

అయితే ప్రస్తుతం అతను ఆ అడవిలో తిరుగుతున్నది నక్సలైట్ల కోసం కాదు.

చింతపండు కోసం.

ఆ అడవుల్లో చింతపండు, కుంకుడుకాయలు అతి చవగ్గా దొరుకుతాయి. కొండవాళ్ళకి ధరలు తెలీవు, తూకాలు తెలీవు.

ఎంతో కొంతకి ఇచ్చేసి పోతారు. వాళ్ళదగ్గర రూపాయికి కొని పది రూపాలకమ్ముకుంటారు షావుకార్లు.

అంచేత చింతపండు కొనడం కూడా తన డ్యూటీలో కలుపుకున్నాడు వెంకటస్వామి.

ఆవేళ అడవంతా తిరగ్గా, తిరగ్గా కాళ్ళు లాగేస్తున్నాయి.

అలా ఒక చెట్టు కింద చేరబడి కూర్చున్నాడు.

చిన్న మాగన్ను పట్టింది. పక్కన ఎండుటాకుల గలగల.

కళ్ళు విప్పేడు.

ఎదురుగా ఉన్నది చింతపండు అమ్మే కొండపిల్ల కాదు.

మంచి వయసులో ఉన్న చిరుతపులి.

హెడ్డు పరిగెత్తేడు.

ఎలా?

రమారమీ పెద్దపులి స్పీడులో.

మరో మూడు సెకండ్లు.

వెంకటస్వామి మిగలడు.

రెండు సెకండ్లు అయ్యేయి.

'ఢాం' అంది తుపాకీ.

గాండ్రించింది పులి.

అదే దాని ఆఖరి గర్జన. హెడ్డు చేతులు చూసుకున్నాడు తుపాకీ లేదు.

ఎదురుగా నిల్చున్నాడు కొండంత కొండవాడు.

చేతిలో తుపాకీ.

అతన్ని కౌగిలించుకుని భోరుమన్నాడు వెంకటస్వామి.

కృతజ్ఞతలు గుప్పించేడు.

అతని రుణం జన్మజన్మలకీ తీర్చుకోలేనన్నాడు.

కొండవాడు నవ్వుకుంటూ వెళ్ళిపోయేడు.

❖ ❖ ❖

కొన్నినెలలు గడిచేయి.

నక్సలైట్ నాయకుడు మల్లుదొరని సజీవంగాగాని, నిర్జీవంగా గాని పట్టుకున్నవారికి లక్షరూపాయలు బహుమానం ప్రకటిం చింది ప్రభుత్వం.

వెంకటస్వామి, అతని అనుచరులు అడువుల వెంట తిరుగు తూనే ఉన్నారు.

ఈ మల్లుదొరెవడ్రా బాబూ మన పీకలమీదికి? ముల్లులా గుచ్చుకుంటున్నాడు. అయినా ఆడు కనిపిస్తే మాత్తరం ఎలా పోల్చుకుంటాం? మెళ్ళో బోర్డుగట్టుకు తిరుగుతాడా? లేకపోతే కొమ్ములుంటాయా? ఎలాగరా బాబూ. ఆళ్ళకేం? అయిదరా బాదులో కూకుని ఆర్డర్లేసేస్తారు, ఆడ్ని పట్టుకోండి, ఈడ్ని కాలి సేయండి అని. "ఈ అడవులంట తిరగలేక ఛస్తున్నా, మనం ఎవుడ్ని పట్టుకున్నా, మానినా మనల్ని మాత్రం ఏ పెద్దపులో, ఎలుగ్గొడ్డో సంపిందంటే అవమానం. మరంచేత ఫలానా అడ విలో పోలీసులకీ నక్సలైట్లకీ జరిగిన ఎన్‌కౌంటర్లో ఇద్దరు పోలీసులు దుర్మరణం, అని మనోళ్ళే పేపర్లో వేయించేస్తారు. తరువాత మన పెళ్ళాలకి పాతికో, పరకో పరేస్తారు. అదిరా బాబూ మన బతుకు" విసుక్కున్నాడు వెంకటస్వామి.

ఆడ్నినేను పోల్చుకోగల్ను అన్నాడో కుర్ర కానిస్టేబిలు.

బయల్దేరేడండి పోటుగాటు నవ్వేరు మిగతావాళ్ళు.

ఆ రాత్రి వాళ్ళంతా గస్తీ తిరుగుతున్నారు.

చిమ్మ చీకటి. చెట్ల మధ్య తిరుగుతున్న మిణుగురు పురు గులు చెట్లకి పూసిన వెండి పువ్వుల్లా మెరుస్తున్నాయి. గెద్ద కలలోకొచ్చిన పక్షిపిల్లల్లా తల్లి రెక్కలక్రింద కువకువ లాడు తున్నాయి. వెంకటస్వామి బృందానికి వాళ్ళ గుండె చప్పుళ్ళు యముడి మహిషపు లోహపు గంటల్లా వినిపిస్తున్నాయి. వాళ్ళ గుండెలు వాళ్ళ పిడికిళ్ళలోనే ఉన్నాయి.

పిడికెడంత గుండె అని అందుకే అంటారు.

అనుకున్నారు వాళ్ళు.

ఎవ్వరూ మాట్లాడలేదు.

వెంటకస్వామి చేతిలో చేతికర్రంత టార్చిలైటుంది.

కాని బేటరీల్లేవు. వెయ్యడం మర్చిపోయినందుకు తనని తను శపించుకున్నాడు. దూరంగా చిన్న వెలుగు, అందరి గుండెల్లోను చిన్న ఆశ. మిణుగురు పురుగేమో అన్న సందేహం. పురుగైతే కదలకుండా ఉంటుందా?

ఉండదు.

అందరి గుండెల్లోనూ చిరు సంతోషం.

అందేదో గుడిసెలాగుంది. కాసేపు అక్కడ కూకుందాం. అన్నాడు వెంటకస్వామి.

తడువుకుంటూ వెళ్ళేరు.

అది గుడిసె.

అందులో మినుకుమినుకుమంటున్న లాంతరు.

గుడిసె బయట నులకమంచం.

మంచంమీద మాంచి నిద్రలో ఉన్నాడు కొండవాడు.

వీడే మల్లుదొర అన్నాడు కుర్ర కానిస్టేబుల్.

తుపాకీలు ఎక్కుపెట్టేరు.

వీడే నన్ను పులినుండి కాపాడేడు అన్నాడు వెంకటస్వామి.

తుపాకీలు దించేశారు.

క్షణంలో సగం...

జబ్బుతో మందుల్లేక లేవలేని తల్లి

ఉద్యోగంలేని తమ్ముడు,

ఎదుగుతున్న పిల్లలు.

చాలని జీతం.

కళ్ళల్లో మెదిలేయి వెంకటస్వామికి.

❖ ❖ ❖

మల్లుదొరని పట్టియిచ్చినందుకు వెంకటస్వామికి ప్రభుత్వం లక్ష రూపాయలు ఇచ్చి రుణం తీర్చుకుంది.

**(ఆంధ్రప్రభ, వారపత్రిక 22.6.1998)**

# దేవుడు కథలు ట్వంటీఫస్ట్ సెంచరీ

**ఆ** వేళ పార్లమెంటులో వాతావరణం ఏ క్షనాన బాంబు పేలు తుందా అన్నట్టు ఉంది. ఇస్ పెడితే అగ్గి అయిపోయేట్టు ఉంది. చూపులే చాకులైతే పార్లమెంటు ఉద్యోగస్తులు తప్ప మంత్రి వర్గంలో సహా అంతమంది సభ్యులూ చచ్చిపోయేవారు.

కారణం సమావేశానికి ముందు ఒక ప్రముఖ పత్రికలో ఒక పేరుపద్ద జర్నలిస్టు ఒక వ్యాసం రాసింది. ఆ వ్యాసానికి ఒక నెల ముందు మన ప్రధానమంత్రిగారు పక్క దేశం ప్రధాన మంత్రిగారితో మూడు రోజుల అంతరంగిక చర్చలు జరిపారు. ఆ వ్యాసం పూర్వార్థం ఏమిటంటే మన దేశంలో ఎప్పుడైనా విప్లవం వస్తే పక్కదేశం ప్రధాని మన ప్రధానమంత్రిగారికి శరణు ఇవ్వడానికి ఒప్పుకున్నారనీ అందుకు ప్రతిఫలంగా మన ప్రధాన మంత్రిగారు మన మిలటరీ రహస్యాలు కొన్ని కోట్ల రూపాయలు పుచ్చుకొని మరీ ఇచ్చేశారని.

ఈ వ్యాసం ఉత్తరార్థం ఆ రెండో ప్రధాని దేశంలో ఎప్పుడైనా విప్లవం వస్తే మనదేశంలో శరణం ఇవ్వడానికి దానికి ప్రతి ఫలంగా ఆ దేశం మిలటరీ రహస్యాలు మన ప్రధానమంత్రికి ఇచ్చేశారనీ మన ప్రధానమంత్రి రెండో ప్రధానమంత్రికి కొన్ని కోట్ల రూపాయలు ఇచ్చేశారనీ.

పార్లమెంటులో ఆ వ్యాసం గురించి చర్చ జరగాలి. "జర" గాలి కూడా పార్లమెంటులో ఆడడం లేదు సరికదా ఉన్న గాలి కూడా ఎంత వేడెక్కిపోయిందంటే బతికున్న మనుషులు బతి కుండగానే కాలిపోతారన్నట్టు ఉంది. వాతావరణంలో ఉన్న క్రౌర్యానికి, పొరపాటున లోపలికి ఎగిరి వచ్చిన గువ్వ గెద్దలా మారిపోయింది.

మన ప్రధానమంత్రిగారు ముసలైపోయారు. అతనికి డయా బిటిస్ దాని కవల బ్లడ్‌ప్రెషర్ ఉన్నాయి. ఇదివరకే రెండు హార్ట్ఎటేక్‌లు వచ్చి వెళ్ళాయి. అంతవరకూ మూడో ఎటేక్ ఎప్పు డొస్తుందో తెలియదు కాని వస్తే వెళ్ళేది ప్రధానమంత్రి గారేననీ అంటున్న స్పెషలిస్టులు ఈ చర్చల్లో పాల్గొంటే మూడో ఎటేక్ వస్తుందని అన్నారు.

అంచేత అధికార పార్టీ ప్రధానమంత్రి గారిని చర్చలో నోరు మూసుకొని కూర్చోమని అతని స్థానే ఉపప్రధానినే పాల్గొమ్మని తీర్మానించింది.

చర్చలో ప్రశ్నల సమయం వచ్చేసింది. సభ్యులు చూపుల చాకులకి సానపడుతున్నారు. గెద్ద అయిన గువ్వ వేడికి పిచ్చెక్కి పోయి గెద్దెల బూతుపాత పాడేస్తున్నది. తల్లిపాలు తాగుతున్న లేడి పిల్ల మీదకి ఉరకడానికి సిద్ధంగా ఉన్న పులిపోజులో ఉన్నారు ప్రతిపక్ష నాయకుడు గారు.

మొన్న జరిగిన చర్చలలో మన ప్రధానమంత్రిగారు ఎన్ని కోట్లు పుచ్చుకున్నారన్నది నా మొదటి ప్రశ్న అన్నది ఆయన మొదటి ప్రశ్న.

దాంతో శత్రువు జుత్తు పట్టేసుకున్న వీరాతి వీరుడులా అయి పోయేరు ఉప ప్రధానిగారు. ఆయన భగవద్గీతలో అర్జునుడితో మాట్లాడుతున్న శ్రీకృష్ణుడిలా మీరుఆ ప్రశ్న అలా అడక్కూడదు. ఎలా అడగాలంటే మన ప్రధానమంత్రిగారు డబ్బు ఏమైనా పుచ్చుకున్నారా, పుచ్చుకుంటే ఎంత పుచ్చుకున్నారూ? అని అడగాలి అని అతి శాంతంగా అని కూర్చున్నారు.

ప్రశ్న ఎలా అడగానో మాకు తెలుసుగాని, ముందు జవాబు చెప్పండి లంజాకొడుకుగారూ? అనిప్రతిపక్ష సభ్యులలో ఎవరో అరిచేరు.

లంజకొడుకు అన్నమాట అసభ్యకరం అని అభ్యంతరం చెప్పేరు పార్లమెంటరీ ఎఫెయిర్స్ మంత్రిగారు.

లంజకొడుకు అన్నమాట అసభ్యకరం అయితే కావచ్చు కాని లంజకొడుకుగారూ అన్నది కాదని ప్రతిపక్ష నాయకుడు గారు అన్నారు.